క్లుప్తంగా

ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ వైద్యం

నగర పంచాయతీ వైస్ చైర్మన్ బడేజానీ



గురజాల : ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్ పాలన అందించడం జరుగుతుందని నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 3వ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బడేజానీ హాజరై మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష నిరుపేదలకు ఒక వరమన్నారు. డాక్టర్లు మన ప్రాంతానికి వచ్చి వైద్య సేవలు, ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ మహంకాళీ నీలంరాజు, మంచి అంజిబాబు, బండి రవి, చల్లా కాశీబాబు, నగర పంచాయతీ చైర్ పర్సన్ అన్నదాత మోహన్ శ్రీనివాస్ తదితరులున్నారు.

రంగవల్లుల పోటీలు



రెంటచింతల: స్థానిక ఫాతిమా విద్యానికేతన్ స్కూల్లో బుధవారం నిర్వహించిన రంగవల్లుల పోటీలు, భోగి మంటలు, హరిదాసు వేషధారణ, కోడిపందేలు, గాలి పటాలు ఎగురవేయడం వంటివి కోలాహలంగా జరిగాయి. పెద్దసంఖ్యలో విద్యార్థినులు పాల్గొని అనేక రకాల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ పూర్ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి థామసమ్మ మాట్లాడుతూ ఏ రంగంలో ఉన్నా మన మూలాలు మరువకూడదన్నారు. స్కూల్ డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి, హెచ్‌ఎం ఏరువ స్టేఫీ, విజేతలకు బహుమతులు అందజేశారు.

యువకుడు బలవన్మరణం



దాచేపల్లి : ప్రైవేట్ బ్యాంక్‌లో తీసుకున్న రుణం ఓ యువకుడి ప్రాణాలను బలితీసుకుంది. తీసుకున్న రుణం చెల్లింపులో జాప్యం జరిగి బ్యాంక్ సిబ్బంది ఒత్తిడిని తట్టుకోలేక దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడికి చెందిన గొల్ల నమ్మ శివయ్య కుమారుడు అజయ్‌కుమార్(32) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. విజయవాడలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో అజయ్‌కుమార్ రూ.7లక్షల రుణం తీసుకున్నాడు. డిసెంబర్ నెలకు సంబంధించి రుణం వాయిదా చెల్లించకపోవటంతో బ్యాంక్ సిబ్బంది రోజుకి 40-50 సార్లు ఫోన్ చేసి ఒత్తిడి చేస్తున్నారు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు అవివాహితుడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సంధ్యారాణి ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని మహిళ మృతి



మాచర్ల రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొని ఒక మహిళ మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నాగార్జున సాగర్ నుంచి మాచర్ల వస్తున్న బత్తుల శివపార్వతి (23), కొత్తపల్లి జంక్షన్, రాధాస్వామి సత్సంగం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనటంతో శివపార్వతి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మండల పాస్టర్ అధ్యక్షుడిగా కొత్తపల్లి

గురజాల : మండల పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొత్తపల్లి అబ్రహంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర పంచాయతీలోని ఏంజెల్ చర్చిలో బుధవారం మండల పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జోజి కుమార్ అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా అంద్రెయ్య, కార్యదర్శిగా వైజీ సాగర్, సంయుక్త కార్యదర్శిగా శాంతి, కోశాధికారిగా మరియదాసు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఏసోబు, ఎబినేజర్, సలహాదారులుగా రాజేష్, యెహెజ్కేలు, జయప్రకాష్, మాణిక్యరావు, జాన్, చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయం

పిడుగురాళ్ల: విజయవాడలో భారత రత్న బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పిడుగురాళ్ల పట్టణంలో 9వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

మండల స్థాయి సమరం షురూ

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు

దాచేపల్లి : ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా మండల స్థాయి పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని కేసానుపల్లి గీతాగురుకులం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ పోటీలను ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య ప్రారంభించారు. విద్యార్థులను పరిచయం చేసుకొని కబడ్డీ ఆడారు. అనంతరం కబడ్డీ పోటీల్లో గ్రామస్థాయి నుంచి మండలస్థాయికి వచ్చిన ఆరు జట్లను ఆడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు సత్తా చూపిస్తున్నారని జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం పాల్గొన్నారు.

మాచవరం: గ్రామీణ ప్రాంత యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ జివ్వెనబోయిన వెంకట శివాయాదవ్ అన్నారు. మండలంలోని వేమవరం, మాచవరం, పిల్లుట్ల గ్రామాల్లోని జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. మాచవరంలో ఖోఖో, కబడ్డీ, పిల్లుట్లలో వాలీబాల్, బ్యాడ్మింటన్, వేమవరంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో యు.వరప్రసాద్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీ చింతపల్లి నన్నేషైదా, మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, జిల్లా కార్యదర్శి జిలుగు వెంకట నరసింహారెడ్డి, సర్పంచులు కనకారెడ్డి, రాగిడి నరేష్, మంగమ్మ, పీఈటీ నందిపాటి నర్సిరెడ్డి, ఆయా గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల: రాష్ట్రం నలుమూలల పల్లె ప్రాంతాలలోని ప్రతిభ కలిగి గుర్తింపుకు నోచుకోని క్రీడాకారులకు తగిన అవకాశం కల్పించి వారిని ప్రోత్సహించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా భారీ క్రీడా కార్యక్రమానికి అన్ని ప్రాంతాల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో ఆయన ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, డీడీవో, మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో సైతం నిర్వహిస్తున్న ఈ పోటీలలో విద్యార్థులు, యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. పోటీలలో పాల్గొంటున్న యువత క్రీడాస్ఫూర్తితో పాల్గొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. హోరాహోరీగా జరిగిన క్రికెట్ మొదటి మ్యాచ్‌లో రెంటచింతల-3, గోలి జట్టుపై, రెండవ మ్యాచ్‌లో జెట్టిపాలెం జట్టు పశర్లపాడు టీంపై విజయం సాధించినట్లు కత్తి రవి తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఉమ, దుర్గి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఇన్నారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షులు రామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ముత్తయ్య, పీఈటీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో విజయవంతంగా మండలంలోని జెడ్పీహెచ్ స్కూల్ మైదానంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రజా ప్రతినిధులు, నాయకులు బుధవారం ప్రారంభించారు. గ్రామ సచివాలయాలలో విజేతలైన క్రీడాకారులు మండల స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపీపీ సాయి శంకర్, మార్కెట్ యార్డు చైర్మన్ గోపాల్, జెడ్పీటీసీ సభ్యులు యలమందలు మాట్లాడారు. మొదటి రోజు నిర్వహించిన క్రికెట్ పోటీలలో దుర్గి 2 సచివాలయం, జంగమహేశ్వరపాడు, ముటుకూరు 1, క్రీడాకారుల మధ్య పోటీలు నిర్వహించారు. పోటీలు ఆసక్తిగా కొనసాగాయి. గ్రామాల నుంచి యువకులు ఉత్సాహంగా పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సమతావాణి, మండల పార్టీ కన్వీనర్ పెద్దబ్బాయి, సర్పంచ్‌లు మాణిక్యం, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ హుస్సేన్, గోపాల్, సెక్రటరీ హఫీజుద్దీన్, ఎంపీడీఓ, గ్రామాల సెక్రటరీలు, నాయకులు, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

గ్రామీణ క్రీడాకారులను గుర్తించడమే ఆడుదాం ఆంధ్రా

పిడుగురాళ్లరూరల్: గ్రామ స్థాయి నుంచి క్రీడల్లో మట్టిలో రత్నాలు వంటి ప్రతిభావంతులను వెతికి పట్టుకునేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొని రావటం హర్షించదగ్గ విషయమని మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామ సచివాలయ స్థాయిలో గెలుపొందిన జట్లకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. జానపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి పోటీలకు మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహిస్తూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలను నిర్వహించటం గతంలో ఏ ప్రభుత్వం నిర్వహించలేదని అన్నారు. జానపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మహిళలకు ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. బ్రాహ్మణపల్లి హైస్కూల్‌లో పురుషులకు వాలీబాల్, క్రికెట్ నిర్వహించారు. కార్యక్రమంలో గురజాల డివిజనల్ స్థాయి అధికారి గబ్రూనాయక్, ఎంపీడీవో కాశయ్య, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, ఎంపీడీవో కాశయ్య



క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



క్రికెట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ చౌడేశ్వరి



మండల స్థాయి పోటీలు ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

విద్యుత్ సమస్యల పరిష్కారంపై అవగాహన సదస్సు



కారెంపూడి: విద్యుత్ సమస్యలుంటే వాటిని కార్యాలయం దృష్టికి తీసుకువచ్చి ఫిర్యాదుల పుస్తకంలో సిబ్బంది చేత నమోదు చేయించాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఈ సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక సెక్షన్ ఆఫీస్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. విద్యుత్ సబ్ స్టేషన్ స్థాయి కమిటీ కన్వీనర్ ఏఈ కోటేశ్వరరావు సదస్సు నిర్వహించి అర్జీలను స్వీకరించారు. సమావేశంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, విశ్రాంత వీఆర్వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

దుర్గి: రైతులు, వినియోగదారులు, ఇండస్ట్రీలకు నాణ్యమైన విద్యుత్ అందించే విధంగా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టాలని ప్రజా ప్రతినిధులు, రైతు సంఘ నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రం దుర్గిలో విద్యుత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సాయి శంకర్, మార్కెట్ యార్డు చైర్మన్ గోపాల్, జెడ్పీటీసీ సభ్యులు యలమందలు మాట్లాడారు. మాచర్ల విద్యుత్ శాఖ ఏడీఈ ఎ.రామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజా ప్రతినిధులు విద్యుత్ సమస్యలను వివరించారు. ఏడీఈ రామయ్య మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మరిన్ని ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేసి వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందించే ఉచిత కరెంటులో ఎటువంటి అంతరాయం లేకుండా అందిస్తున్నామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు గ్రామాలలోని సమస్యలు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పెద్దబ్బాయి, జానకి రాము, రామయ్య, యలమంద, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జూనియర్ అసిస్టెంటు శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులున్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

పాత అంబాపురంలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాసు

గురజాల : ప్రతి గడపకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాత అంబాపురం గ్రామంలో బుధవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చిన్న గ్రామంలో కూడా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందే విధంగా చర్యలు చేపట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంతో పోల్చితే ఈ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. ముందుగా గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ పాశం హేమలత, ఎంపీపీ నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ శేషమ్మ చలమయ్య, సీనియర్ నాయకుడు హనిమిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ అన్నారావు, దాచేపల్లి-గురజాల మార్కెట్ యార్డు చైర్మన్ అంద్రెయ్య, పీర్ అహ్మద్, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ప్రగతి కోటేశ్వరరావు, అంజిబాబు, గిరిబాబు, సాగర్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పనుల నాణ్యతలో రాజీ పడితే ఉపేక్షించేది లేదు

పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి

రెంటచింతల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడితే ఉపేక్షించేది లేదని పంచాయతీరాజ్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మకోట, మిట్టగుడిపాడు, జెట్టిపాలెం, రెంటచింతల గ్రామాలలో సీసీ రోడ్లు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. తుమ్మకోట ఎస్సీ కాలనీలో రూ.15 లక్షల ఎంపీ నిధులతో డ్రైనేజ్‌లతో సీసీ రోడ్డు, మిట్టగుడిపాడు గ్రామంలో రూ.20 లక్షల గడప గడప నిధులు మరో రూ.7.50 లక్షలు ఉపాధిహామీ నిధులతో బీసీ, ముస్లిం మైనార్టీ కాలనీలలో సీసీ రోడ్లు, జెట్టిపాలెం గ్రామంలోని ఎస్టీ, ఎస్సీ కాలనీలలో రూ.18 లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్లు, రెంటచింతల రేగుల మాన్యం ఎస్టీ కాలనీలో రూ.15 లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్లు నిర్మాణ పనులను పరిశీలించడం జరిగిందన్నారు. లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు నాలుగు కాలాలపాటు మన్నికతో ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గుత్తేదారులు అంచనాల ప్రకారం అభివృద్ధి పనులను కచ్చితంగా చేపట్టాల్సిందేనన్నారు. నాణ్యత లేకుండా చేసిన పనులకు బిల్లులు నిలిపివేయడం జరుగుతుందన్నారు. పరిశీలించిన పనులకు సంబంధించి పూర్తి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శౌంఠిరెడ్డి గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుమ్మకోట గ్రామంలో సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ శ్రీనివాసరెడ్డి

ప్రతి మనిషి క్షమాగుణం కలిగి ఉండాలి

- ఫాదర్ మోపూరి రాయపరెడ్డి
- ఘనంగా గోల్డెన్ జూబ్లి ఉత్సవాలు

దుర్గి: ప్రపంచ మానవాళి ప్రేమ, దయ, శాంతి కలిగి ఉండాలని బిషప్ గాలి బాలి ఫాదర్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. బుధవారం మండలంలోని ఆత్మకూరు సెయింట్ మార్టిన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో రెవరెండ్ ఫాదర్ మోపూరి రాయపరెడ్డి గోల్డెన్ జూబ్లి ఉత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొని వారు ప్రసంగించారు. ఫాదర్ రాయపరెడ్డి, ఉపాధ్యాయుడిగా, దైవ గురువుగా తన జీవిత కాలాన్ని దైవ సన్నిధిలో గడిపి అనేక మంది విద్యార్థులను దైవ సహాయకులగా, గురువులగా తీర్చిదిద్దారన్నారు. పల్నాటి ప్రాంతంలోని మారుమూల ఆత్మకూరులో పేద కుటుంబంలో జన్మించి చిన్నతనంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా సేవ చేయటం గొప్ప విషయమన్నారు. దేవుని సేవలో 50 సంవత్సరాలు పూర్తి అయిందంటే మీ అందరి ఆదరాభిమానాలు దేవుని పట్ల తన కున్న విశ్వాసమని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి 50 మందికి పైగా గురువులు హాజరై రాయపరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులు, అలనాటి శిష్యులు ఉత్సవాల్లో పాల్గొని రాయపరెడ్డికి అభినందనలు తెలిపి సత్కరించారు. సెయింట్ మార్టిన్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఫాదర్‌లు రత్నబాబు, ఫాతిమా మర్రెడ్డి, అధ్యక్షులు కిరీటిరెడ్డి, సభ్యులు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నాగిరెడ్డి, మర్రెడ్డి, అడ్వకేట్ నాగిరెడ్డి, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ శాంతిరెడ్డి, మర్రెడ్డి, చిన్నపరెడ్డి, ఆంథోనిరెడ్డి, సౌరెడ్డి, రాయపరెడ్డి, హెచ్‌ఎం రేణుక పాల్గొన్నారు.



ఫాదర్ రాయపరెడ్డిని సత్కరిస్తున్న వారి శిష్యులు మదర్ థెరిసా సేవా సమితి సభ్యులు

అనాథ శవానికి అంత్యక్రియలు

మాచర్ల: పట్టణంలో ఓ అనాథ వ్యక్తి మృతిచెందగా పట్టణంలోని స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ మెట్టు గోవిందరెడ్డి మున్సిపల్ అధికారులు, దుర్గి పోలీసుల ఆధ్వర్యంలో మృతదేహాన్ని తరలించి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. దుర్గి మండలంలోని రాజానగర్ పొలం శివారులో ఉన్న మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు పోస్టుమార్టం చేశారు. మూడు రోజులు అయినా ఎవరూ రాలేదు. ఈ నేపథ్యంలో అర్బన్ సీఐ పి.శరత్‌బాబు సమాచారం మేరకు మెట్టు గోవిందరెడ్డి ఆ శవాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించటం జరిగింది. అనేక సంవత్సరాలుగా అనాథలు మృతి చెందితే స్పందించి అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆయన ముందుకొస్తున్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు

మాచర్ల: ఇబ్బందులలో ఉన్న పేదలు, వృద్ధులకు తమ వంతు సహాయ సహకారాలందిస్తున్నట్లు అల్లం రామిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు అల్లం కోటిరెడ్డి అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసి మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్ళుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కంభంపాడు పీహెచ్‌సీ మాజీ చైర్మన్ కంచర్ల లక్ష్మీరాంబాబు, అల్లం రామ్మోహన్‌రెడ్డి, శ్రావణి దంపతులు, వైద్యులు రమ్య, ఆశీర్వాదం, సిబ్బంది తదితరులున్నారు.

పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

రెంటచింతల: గ్రామాలలోని పారిశుద్ధ్య పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు అధిక ప్రాధాన్యత నివ్వాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ యార్ల మహాలక్ష్మి అధ్యక్షతన వివిధ శాఖాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బందితో ఫీవర్ సర్వే చేపట్టి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ శౌర్రెడ్డి, మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, పీఆర్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేంద్రారెడ్డి, గృహనిర్మాణ శాఖ ఏఈ శ్రీనివాసరావు, ఏపీఓ జయచంద్ర, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్లలో పారిశుద్ధ్య పనులు



మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు కార్మికులతో మాట్లాడి పట్టణంలోని వార్డులలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవటం వలన ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందని, ప్రజలెవ్వరినీ ఇబ్బందులకు గురిచెయ్యకూడదన్న ఉద్దేశంతో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశానుసారం మున్సిపల్ కార్మికులకు ప్రజల ఇబ్బందులను వివరించటం జరిగిందన్నారు. సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కార్మికులు స్వచ్ఛందంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పట్టణంలోని వార్డులలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ రమణబాబు దగ్గరుండి పర్యవేక్షించారు.

కొత్త పింఛన్లు పంపిణీ



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

దాచేపల్లి : కొత్త పింఛన్ల సంబరాలు బుధవారం జరిగాయి. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లకు సంబంధించిన నగదును లబ్ధిదారులకు జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య పంపిణీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ నగదును రూ.3 వేలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచారని, పింఛన్‌దారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎంపీపీ జయశ్రీ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, నాయకులు బొల్లా పెదరామయ్య, నెల్లూరి కోటేశ్వరరావు, ఉల్లేరు హనుమంతరావు, ఐనాల శ్రీరాములు పాల్గొన్నారు.

ఏపీలోనే రూ.3వేలు పింఛన్

గురజాల : ఆంధ్ర రాష్ట్రంలోనే రూ.3వేల పింఛన్ అందించడం జరుగుతుందని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి అన్నారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో బుధవారం పెంచిన పింఛన్లను అందించారు. ఎంపీపీ మాట్లాడుతూ మన రాష్ట్రంలో గల సంక్షేమ పథకాల గురించి పక్కా రాష్ట్రాలు కూడా మన రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, సొసైటీ అధ్యక్షుడు గురవయ్య, రోశయ్య, శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రీనివాసరావు

పింఛన్‌దారుల సేవలో వలంటీర్లు

కారెంపూడి: హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న పింఛన్‌దారులు ఇద్దరికి వలంటీర్లు బుధవారం పింఛన్ అందించి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. నరమాలపాడు గ్రామ వలంటీర్ లక్కిరెడ్డి కోటిరెడ్డి నరసరావుపేటలో చికిత్స పొందుతున్న లింగాల సాంబయ్యకు వృద్ధాప్య పింఛన్ అందించారు. అదేవిధంగా గాదెవారిపల్లె గ్రామ వలంటీర్ శ్రీనివాసరావు గుంటూరులోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బూదేవమ్మకు వృద్ధాప్య పింఛన్ అందించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

మాచర్ల: సంస్కృతి, సంప్రదాయాలు, జాతి వారసత్వ సంపద అని, వాటిని తర్వాతి తరాలకు అందించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు చుండూరు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని పత్తిఫ్యాక్టరీ వద్ద సాయిబాబా దేవాలయం ప్రాంతంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయానికి ముగ్గులు చిహ్నమన్నారు. వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించటం సంతోషమన్నారు. జడ్జిలుగా బొట్ల సుజాత, చుండూరు సరస్వతిలు వ్యవహరించారన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు మేడా వెంకటలక్ష్మి, సెక్రటరీ నరసింహారావు, ధనలక్ష్మి, జాయింట్ సెక్రటరీ రాజ్‌కుమార్, లక్ష్మీ ప్రమీల, సత్యనారాయణ న్నారు.

మాచవరం: సంస్కృతి, సంప్రదాయలకు సంక్రాంతి పండుగ ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఇంటా భోగభాగ్యాలు నిండుగా నిలవాలని పిడుగురాళ్ల పల్నాడు హాస్పిటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చింతలపూడి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. స్థానిక గ్రామ సర్పంచ్ రాగిడి నరేష్, డాక్టర్ రమ్య హారిక, శ్రీనివాసరావు, ఆర్‌ఎంపీ లింగయ్య పాల్గొన్నారు.

